క్లుప్తంగా

గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరి

రామగుండం: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించినట్లు అంతర్గాం ఎంపీడీవో యాదగిరి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామాల్లో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎంపీడీవోతో పాటు ఎంపీవో మోతె సమ్మిరెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ధనుర్మాసం దీక్షాపరులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం దీక్ష తీసుకున్న వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పరి సమాప్తం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ ఆండాళ్ తల్లి, వేణుగోపాలస్వామి వారి ఆలయ అర్చక దంపతులు శ్రావణ్‌కుమార్, హరిణి అమ్మవారు దీక్షాపరులకు ఆశీర్వాదం అందజేశారు. సుగుణాకర్, శివ ఉన్నారు.

వీధిదీపాల పునరుద్ధరణకు వినతి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో వీధిదీపాల పునరుద్ధరణ కోసం డీసీసీ అధికార ప్రతినిధి వెంగల బాపు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. డివిజన్‌లోని ఇండియన్ గ్యాస్ గోడౌన్ నుంచి నర్రాశాలపల్లె వరకు గల వీధి దీపాలు వెలగకపోవడం, చెట్ల నీడతో వెలుతురు రోడ్డుపై కనిపించక రాత్రివేళల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు వీధిదీపాలను పునరుద్ధరించాలని ఆయన వినతిపత్రంలో అధికారులను కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

ఓదెల: మండలంలోని గోపరపల్లె గ్రామంలో ఉపాధి పనులను ఎంపీడీవో జి.సత్తయ్య బుధవారం పరిశీలించారు. గ్రామంలో ఉపాధి పనుల కింద చేపడుతున్న నర్సరీ పెంపకం, సెగ్రిగేషన్ షెడ్డు, కూలీల పనితీరుపై ఎంపీడీవో ఆరా తీశారు. ఆయన వెంట కార్యదర్శి ప్రసాద్, ఫీల్డ్‌అసిస్టెంటు పాల్గొన్నారు.

విద్యారంగ బలోపేతానికి కృషిచేయాలి

గోదావరిఖనిటౌన్: గత ప్రభుత్వం విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించి నిర్లక్ష్యం వహించిందని, ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ కోరారు. బుధవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రెండేళ్లుగా విడుదల చేయలేదు దీంతో రూ.8వేల కోట్ల బకాయిలతో విద్యార్థుల ధృవీకరణ పత్రాలు ఇవ్వకుండా ప్రైవేయిట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురుచేస్తున్నాయని వాపోయారు. మెస్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. నరేశ్, కళ్యాణ్, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ నేతల సంబరాలు



సంబరాల్లో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు శాసనమండలి అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్టానం ప్రకటించడంపై జిల్లా అధ్యక్షుడు కొమ్ము అభిలాష్ హర్షం వ్యక్తం చేసారు. బస్టాండ్ ప్రాంతంలో నాయకులతో కలిసి బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు. నాయకులు భరత్, పవన్, రాజు, అనిల్, ప్రశాంత్‌రాజ్, వెంకటేశ్, రాహుల్, ప్రశాంత్, విజయ్, సాయికుమార్, సాయి నితిన్, అజయ్, అనిల్ ఉన్నారు.

ప్రజాపాలన 'ఆన్‌లైన్' పూర్తి

- జిల్లాలో మండలాల నుంచి 5 గ్యారంటీ పథకాలకు 2,31,341 దరఖాస్తులు
- ఇతర దరఖాస్తులు 38,120



ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బందితో ఎంపీడీవో శశికళ

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలో 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు జిల్లాలోని 14 మండలాల పరిధిలో 380 గ్రామసభలు నిర్వహించగా ప్రజల నుంచి 2,69,461 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని 4 పురపాలక సంఘాల పరిధిలో నిర్వహించిన వార్డు సభల్లో ప్రజల నుంచి గ్యారంటీ పథకాలకు 77,389 దరఖాస్తులు వచ్చాయి. గ్యారంటీ పథకాల దరఖాస్తుతో పాటు రేషన్‌కార్డుల కోసం కూడా ప్రజలు తెల్లకాగితాలపై రాసి అధికారులకు అందించారు. మంత్రి శ్రీధర్‌బాబు, విప్ లక్ష్మణ్‌కుమార్ ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కాన్‌సింగ్ తమ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో పాల్గొని గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీదేవసేన, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్ లాల్, అరుణశ్రీ, అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామసభలు ముగిశాక వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

7వ తేదీ నుంచి ఆన్‌లైన్..

దరఖాస్తులను ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను 7వ తేదీ నుంచి వేగవంతం చేశారు. పురపాలికల్లో, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా కంప్యూటర్ విభాగాలను ఏర్పాటు చేసి అదనపు సాంకేతిక సిబ్బందిని నియమించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జనవరి 17వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేర్చే ప్రక్రియ పూర్తి చేశారు. అన్ని మండలాల్లో 100శాతం పూర్తయినట్లు జెడ్పీ సీఈవో శ్రీనివాస్ వెల్లడించారు.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే..



ప్రభుత్వ ఆదేశాలు రాగానే ప్రజాపాలన దరఖాస్తులను విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిస్తాం. మున్సిపల్‌లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేశాం. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో ఏ దశలో ఉందో చూసుకోవచ్చు.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, సుల్తానాబాద్

గడువులోగా పూర్తిచేశాం



ప్రజాపాలనకు వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు రాగానే డీపీవో ద్వారా ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశాం. వెంటనే కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్ల సహకారంతో వేగంగా పూర్తిచేశాం. ప్రభుత్వ ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు ఉంటాయి.

– శ్రీనివాస్, జెడ్పీ సీఈవో, పెద్దపల్లి

గోలివాడ జాతర వేలంలో పాల్గొనండి



మాట్లాడుతున్న చైర్మన్ హన్మాన్‌రెడ్డి

రామగుండం: అంతర్గాం–గోలివాడ గ్రామాల శివారు గోదావరి నది ఒడ్డున ఫిబ్రవరి 21–24వ తేదీల్లో సమ్మక్క–సారలమ్మ జాతర వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హన్మాన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం అంతర్గాం ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాగా జాతరలో నిర్వహించుకునే చిరు వ్యాపారాలకు 20వ తేదీన గోలివాడ గ్రామ రామాలయంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.వంద చెల్లించి టెండర్ షెడ్యూల్ ఫారం పొందాల్సి ఉంటుందన్నారు. వేలంలో నిర్వహించే వ్యాపారాలను రెండు కేటగిరీలుగా విభజించారు. వేలంలో కొబ్బరికాయలు, బెల్లం, తలనీలాలు, తల్లి ఆరాధన, తైబజార్ వ్యాపారాలు దక్కించుకున్న వ్యాపారులు రూ.50వేలు అప్పటికప్పుడే చెల్లించాల్సి ఉంటుంది. రెండో కేటగిరీలో ప్యాలాలు, పుట్నాలు, సైకిల్ స్టాండ్, లడ్డు ప్రసాదం, చల్లని పానీయాలు టెండర్ దక్కించుకున్న వ్యాపారులు రూ.20వేలు అప్పటికప్పుడు చెల్లించాలి. వేలంలో దక్కించుకున్న వ్యాపారులు జాతరకు వారంరోజుల ముందు వేలంలో పేర్కొన్న మిగతా మొత్తాన్ని చెల్లించాలని ఆయన వివరించారు. జాతర కమిటీ ప్రతినిధులు రామ్మూర్తిగౌడ్, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి



నూతన కమిటీ లేఖను అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 సీఎస్పీలో సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం సీఎస్పీ ఎస్ఈ దాసరి శ్రీనివాస్‌ను కలిసి నూతన కమిటీ లేఖను అందజేశారు. పరస్పర సహకారంతో సంస్థ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, ఆరెలి పోశం ఉన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు పెద్దపీట



సన్మానిస్తున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్: గ్రామాల్లో మౌలిక వసతులకు నిధులు కేటాయించి పెద్దపీట వేశామని, మెజారిటీ గ్రామాల్లో సీసీరోడ్లు పూర్తయ్యాయని, భవిష్యత్‌లో గ్రామాలు ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో ముందుండాలని సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో సర్పంచుల పదవీకాలం జనవరి 30న ముగుస్తున్నందున ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సర్పంచులను సన్మానం చేయడంతో పాటు షీల్డ్‌లు అందజేశారు. ఎంపీపీ, ఎంపీడీవో, ఎంపీవోలను సర్పంచులు సన్మానించారు. వైస్ ఎంపీపీ కోట స్వప్నరెడ్డి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో ఫయాజ్ అలీ, బాబా, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు వీరగోని సుజాత, రమేశ్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు ఫకీర్ యాదవ్, మోహన్‌రెడ్డి, అరుణజ్యోతి విజేందర్‌గౌడ్, రమేశ్, వెంకన్న, సాగర్‌రావు, అంజయ్య, రాయమల్లు, శంకర్, తిరుపతి, అరుణ్, రాజు, అంజయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌వోను కలిసిన ఫిట్ కమిటీ



ఎస్అండ్ పీసీ ఫిట్ కమిటీతో పరిచయం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఏఐటీయూసీ ఎస్అండ్‌పీసీ ఫిట్ కమిటీ సభ్యులు బుధవారం ఆర్జీ–2 కార్యాలయంలో ఎస్ఎస్‌వోను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నుకున్న ఎస్అండ్‌పీసీ కమిటీ సభ్యులు పరిచయం చేసుకుని కార్మికుల సమస్యలు వివరించారు. ఏఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్, ఫిట్ సెక్రటరీ నర్సయ్య, అడ్వైజర్ కొమురయ్య, కమిటీ సభ్యులు లచ్చయ్య, శ్రీనివాస్, రవికుమార్, రాజుకుమార్, సురేశ్, కనుకయ్య, రాములు, శాంసన్, రాజయ్య పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీలో న్యాయం చేయండి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం ఇవ్వాలని పెద్దపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కల్వల శ్రీనివాస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వేరువేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.

నేషనల్ బెస్ట్ యోగా మాస్టర్ జబ్బర్‌లాల్



ఆహ్వానపత్రం అందుకుంటున్న జబ్బర్‌లాల్

యైటింక్లయిన్‌కాలనీ: బెస్ట్ యోగా మాస్టర్ నేషనల్ అవార్డు–2024కు గాను కాలనీకి చెందిన జబ్బర్‌లాల్ ఎంపికైనట్లు జాతీయ అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్, బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆహ్వాన పత్రాన్ని జబ్బర్‌లాల్‌కు అందజేశారు.

కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా రాజేందర్



రామగుండం: అంతర్గాం మండల కేంద్రానికి చెందిన అప్పాల రాజేందర్‌ను కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులకు రాజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందుర్తి, గుంపుల, గూడెం గ్రామాల్లో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపులకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేసి ధృవపత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

రవాణా చేసే అవకాశం లోకల్ లారీలకే ఇవ్వాలి

- రాఘవాపూర్ గోదాముల వద్ద వాగ్వాదం



గిడ్డంగుల వద్ద లారీ అసోసియేషన్ సభ్యుల వాగ్వాదం, సముదాయిస్తున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని గిడ్డంగుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు వీలుగా సుల్తానాబాద్ మిల్లర్లు వారి లారీల్లో తీసుకెళ్తుండగా పెద్దపల్లి లారీ అసోసియేషన్ నాయకులు అభ్యంతరం తెలిపారు. రాఘవాపూర్ గిడ్డంగుల్లో భూపాలపల్లి జిల్లాకు చెందిన 23వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం నిల్వ ఉండగా ప్రభుత్వం అందులోనుంచి 8వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రవాణా చేసుకుని సీఎంఆర్ మిల్లింగ్ చేసేందుకు అనుమతి ఇచ్చిందని సుల్తానాబాద్ మిల్లర్లు పేర్కొన్నారు. సుల్తానాబాద్ మిల్లర్లు లారీల ద్వారా తీసుకెళ్తుండగా స్థానిక లారీ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో చేరుకుని అభ్యంతరం చెప్పి లారీలను అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. ఇందుకు సంబంధించిన అధికారుల సమక్షంలో సామరస్యంగా చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో స్థానిక లారీ అసోసియేషన్, సుల్తానాబాద్ మండల మిల్లర్లు సీఐ అనిల్ సమక్షంలో చర్చించారు. అడిషనల్ కలెక్టర్ వద్ద మాట్లాడి పరిష్కరించుకుంటామని చెప్పినట్టు లారీ యజమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు బారీ చెప్పారు.

డాక్టర్‌పై ఫిర్యాదు

మంథని: మంథని మాతాశిశు ఆస్పత్రిలో పనిచేసే మత్తు డాక్టర్ మోహన్‌రావు డెలివరీ సర్జరీకి డబ్బులు వసూలు చేశాడని బండారి సమ్మయ్య బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చేదాకా ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీ మొదలు పెట్టలేదన్నారు. రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న సదరు డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై వైద్యుడు మోహన్‌రావును ఫోన్‌లో వివరణ కోరగా తాను డబ్బులు ఎవరి దగ్గరా తీసుకోలేదన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



కప్ అందిస్తున్న శ్రీనుబాబు

మంథని: మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన శ్రీపాద కప్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి బహుమతి వెంకీ ఎలెవన్స్ జట్టుకు రూ.లక్ష, రెండో బహుమతి చక్‌దే జట్టు రూ.50 వేలు అందించారు. విజేతలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు బహుమతి ప్రదానం చేశారు. సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ పెంద్రు రమాదేవి, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, ఐలి ప్రసాద్, శశిభూషణ్ కాచే, పోలు శివ, మంథని సత్యం ఉన్నారు.

జాతర నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టండి



జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలోని గోదావరి ఒడ్డున సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణపై అధికారులు మొద్దునిద్ర వీడి, యుద్ధప్రాతిపదికన ప్రత్యేక చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం జాతర ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ప్రతినిధులు జాతర జరిగే ప్రాంగణాన్ని పరిశీలించారు. జాతర ప్రారంభం కావడానికి ఇంకా నెలరోజులే సమయం ఉందని, అయినా అధికారులు పనులు ప్రారంభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి రవీందర్, జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ప్రతిసారి జాతర ప్రారంభమయ్యాక అధికారులు ఆర్భాటం చేస్తూ మొక్కుబడిగా ఏర్పాట్లు చేపడుతున్నారని ఆరోపించారు. గోదావరి ఒడ్డును చెత్త డంపింగ్ యార్డుగా మార్చిన మున్సిపల్ అధికారులు, చెత్తను పూర్తిగా తొలగించి శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి పుష్కర ఘాట్ నుంచి గంగానగర్ బ్రిడ్జి వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. గోదావరి పుణ్యస్నానాలకు వచ్చే మహిళల సౌకర్యార్థం పర్మినెంట్ స్నానపు గదులు నిర్మించాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి మేడగోని రవీందర్, ఈసంపల్లి వెంకన్న, నేరేడుకొమ్మ వెంకటస్వామి, కొండపర్తి లింగన్న, మునగాల సంపత్, అడిగొప్పుల రాజు, కుంబార్ అజయ్, జలంధర్, ఎరుకల సుధీర్, బాలు, మోహన్‌రెడ్డి, చక్రపాణి, లడ్డు పాల్గొన్నారు.

కూలిపోయిన వంతెనను వెంటనే నిర్మించాలి



కూలిన వంతెన వద్ద నాయకులు

గోదావరిఖని: జనగామ గ్రామంలో వరదకు కూలిపోయిన వంతెనను వెంటనే నిర్మించాలని సింగరేణి యాజమాన్యాన్ని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2022లో భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరదలు రావడంతో వంతెన కూలిపోయిందన్నారు. వంతెన కూలిన ప్రాంతాన్ని అప్పటి ఎమ్మెల్యే చందర్‌తో పాటు ఎంపీ వెంకటేశ్, సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సందర్శించారు. వంతెనను పునర్నిర్మాణం చేపడతామని చెప్పారన్నారు. ఏడాదిన్నర గడుస్తున్నా ఆ హామీ నెరవేరలేదని ఆరోపించారు. వంతెనకు నిధులు మంజూరు చేసినా ఎందుకు మరమ్మతులు చేయడం లేదని వారు ప్రశ్నించారు. దీంతో గ్రామం నుంచి గోదావరి నదికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ స్పందించి కూలిన వంతెనను పునర్నిర్మాణం చేయించాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజు, నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్‌కుమార్, తాళ్లపెల్లి మల్లయ్య, గుంపుల కుమారస్వామి, జైపాల్‌రెడ్డి, కల్వల జగన్ పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి నాగవెల్లి పట్నం



ఎలిగేడు: మండలంలోని లాలపల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మల్లికార్జునస్వామి, కేతమ్మల నాగవెల్లి పట్నం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అగ్నిగుండాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఆలయ కమిటీ సభ్యులు సామ రాజేశ్వర్‌రెడ్డి, పెద్ది రాజేశం, బద్దం మల్లారెడ్డి, గడ్డం శ్రీనివాసరెడ్డి, నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, కల్లెం శ్రీనివాసరెడ్డి, మైపాల్‌రెడ్డి, క్రాంతికుమార్, రామయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

లాలపల్లిలో జరుగుతున్న మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నాగవెల్లిపట్నానికి హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాసంపల్లి కొండయ్య, తిరుమల్‌రెడ్డి ఉన్నారు.

బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న కార్యనిర్వహణ అధికారి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నీరుకుల్ల–వేగురుపల్లి సమ్మక్క జాతర సందర్భంగా సీల్డు టెండర్ కం బహిరంగ వేలం బుధవారం జాతర ప్రాంతంలో ఎండోమెంట్ కార్యనిర్వహణాధికారి శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే జాతరలో కొబ్బరికాయలు, బెల్లం, లడ్డు, పులిహోర ప్రసాదం, పుట్నాలు, ప్యాలాలు, తలనీలాలు, తల్లి ఆరాధన(కోళ్లు) అమ్ముకోవడడం, ప్రతిదానికి ధరావత్ రూ.20వేలు డిపాజిట్ సేకరించిన అనంతరం వేలం నిర్వహించారు. బెల్లం, కొబ్బరికాయలకు రూ.1.67లక్షలకు ఎనగంటి రమేశ్, లడ్డు, ప్రసాదం రూ.1.19లక్షలకు కొలిపాక పృథ్వీ, తలనీలాలు రూ.72వేలకు పొగర్త శివశంకర్ వేలంలో దక్కించుకున్నట్లు శంకర్ పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ నర్సయ్యగౌడ్, డైరెక్టర్లు కొయ్యడ స్వామి, బండ రాజు, లావణ్య, గోపాల్‌రెడ్డి, పొన్నం చంద్రయ్య, స్వామి, సంపత్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

జూలపల్లి: గ్రామాల్లోని అభివృద్ధి పనుల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాయలంలో ఎంపీపీ అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేణుగోపాలరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అభివృద్ధి పనుల నివేదికలను ఈ నెలాఖరు లోపు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి పీఆర్ ఏఈ రాజశేఖర్, ఎంపీవో కిరణ్, వ్యవసాయశాఖ, అంగన్‌వాడీ, వెలుగు సమాఖ్య, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దపల్లి విద్యార్థినులకు నాట్యమయూరి అవార్డు



అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి పాఠశాల విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన నృత్యమాల నాట్యకళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. కూచిపూడి గ్రూప్ నృత్యప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించింది. నృత్యప్రదర్శన ఇచ్చిన చిన్నారులు మహాలక్ష్మి, సమూల్య, వినూత్నను ముఖ్య అతిథులు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, నాట్యగురు శశిబాబు, దేవగణశర్మ అభినందించారు.